క్లుప్తంగా

ఉచిత మెగా కంటి వైద్యశిబిరం

చింతకొమ్మదిన్నె : స్థానిక ఆర్డీఓ కార్యాలయం సమీపంలోని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.సుధాకర్‌రెడ్డి తెలిపారు. కడప నగరంలోని ఎర్రముక్కపల్లిలో ఉన్న భారతీ కంటి ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని కళాశాల విద్యార్థులకు, అధ్యాపకులకు నిర్వహించారన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు డాక్టర్ హారికారెడ్డి, హెచ్‌ఓడీలు, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలి



సిమెంటు రోడ్డు పనులను పరిశీలిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి, తదితరులు

పులివెందుల టౌన్ : పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక భాకరాపురంలో మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డితో కలిసి ఆయన పర్యటించి అక్కడ జరుగుతున్న సిమెంటు రోడ్డు పనులను పరిశీలించారు. అలాగే నీటి సరఫరాపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. టౌన్ ప్లానింగ్ అధికారి అజయ్‌కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ సేవలు సద్వినియోగం చేసుకోండి

పులివెందుల రూరల్ : ప్రయాణీకుల సౌకర్యార్థం ఆర్టీసీ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ ఇన్‌చార్జి డీఎం గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక ఆర్టీసీ సంస్థ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కార్తీక మాసం సందర్భంగా భక్తుల కోసం క్షేత్రాలకు స్పెషల్ బస్సులను నాలుగు సోమవారాలు పులివెందుల డిపో నుంచి నడుపుతున్నామన్నారు. ప్రతి సోమవారం ఆర్టీసీ డిపో నుంచి ఉదయం 5గంటలకు బయలుదేరి యాగంటి, నందవరం, మహానంది, ప్రొద్దుటూరు రామేశ్వరం, కన్యతీర్థం ప్రాంతాలకు వెళ్లి తిరిగి రాత్రి 8గంటలకు పులివెందులకు చేరుకుంటాయన్నారు. పెద్దలకు రూ.550లు, పిల్లలకు రూ.300లు ఉంటుందన్నారు. అలాగే జిల్లాలో ఉన్న శైవ క్షేత్రాలకు కార్తీక మాసం సందర్భంగా ప్రత్యేక బస్సులను నడుపుతున్నామన్నారు.

ఆర్థిక సాయం



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న జెడ్పీటీసీ పి.నరేన్‌రెడ్డి

చింతకొమ్మదిన్నె : ప్రొద్దుటూరు సమీపంలోని మల్లేల వద్ద ఇటీవల దైవ దర్శనానికి వెళ్తూ మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను గురువారం సీకేదిన్నె జెడ్పీటీసీ పి.నరేన్ రామాంజులురెడ్డి పరామర్శించారు. ప్రమాదంలో ఒకే కుటుంబ సభ్యులు మృతి చెందడంతో మృతుల పెద్ద కర్మకు వారి కుటుంబ సభ్యులకు రూ.20వేలు అందించారు. కార్యక్రమంలో మండల సమన్వయకర్త గుత్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు గజ్జల శ్రీరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ఉదయం చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ వి.ప్రతాప్‌రెడ్డి తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే ఆసుపత్రిలో 24గంటలు ఎండోస్కోపీ, కోలనోస్కోపీ పరీక్షలతోపాటు గ్యాస్ట్రబుల్ తీవ్రత తెలుసుకోవడం, చిన్నపిల్లలు నాణేలు, పిన్నులు, సూదులు, ముక్కలు మింగితే తీయడం జరుగుతుందని.. ఎసోఫజిల్ వెరిసెస్‌కు ఎండోస్కోనిక్ బాండిన చేస్తామన్నారు.

అలాగే ప్రముఖ చర్మవ్యాధుల నిపుణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య సోరియాసి స్, తామర, గజ్జి, ఫంగస్, ఇన్ఫెక్షన్, మొటిమ లు, బెదులు, దద్దుర్లు, చుండ్రు, బొల్లి తదితర వ్యాధులకు వైద్య చికిత్సలు అందిస్తారన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 08568 286189, 9963170177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

చీటింగ్ కేసులో నిందితుడు అరెస్ట్

కడప అర్బన్ : కడప నగరంలోని దేవునికడప రోడ్‌లోని పెట్రోల్ బంక్‌లో డబ్బులను స్వాహా చేసిన కేసులో నిందితుడు వల్లూరు మండలం అంబవరానికి చెందిన చిన్న చెంచు నరసింహారెడ్డిని గురువారం అరెస్ట్ చేసినట్లు కడప టూటౌన్ సీఐ తబ్రేజ్ తెలియజేశారు. నిందితుడు దేవుని కడప రోడ్డులో వున్న పెట్రోల్ బంకులో పంపుబాయ్‌గా పనిచేస్తుండేవాడు. గత కొంతకాలంగా ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా పెట్రోల్ బంక్‌లో వచ్చే డబ్బులను అతని ఖాతాలో జమచేసుకున్నట్లు, లక్షల్లో స్వాహా చేసినట్లు మేనేజర్ ఫిర్యాదు మేరకు గత ఆగస్టులో కేసు నమోదు చేశారు. ఈ చీటింగ్ కేసులో నిందితుడైన నరసింహారెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు.

జగనన్న మళ్లీ సీఎం కావాలి



కమలాపురంలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



ఎర్రగుంట్ల : మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి

కమలాపురం : మన కోసమే కాదు.. మన భవిష్యత్తు తరాల కోసం జగనన్న తిరిగి సీఎం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. గురువారం కమలాపురం 1వ వార్డు సచివాలయంలో నిర్వహించిన ఏపీకి జగనే ఎందుకు కావాలి? కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ముందుగా సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం గిడ్డంగి వీధిలో ఏర్పాటు చేసిన పార్టీ జెండాను ఎగురవేశారు. 1వ వార్డు సచివాలయం పరిధిలో రూ.35 కోట్లు ప్రజలకు డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా చేరిందన్నారు. అలాగే రూ.4 కోట్లకు పైగా నిధులతో అభివృద్ధి పనులు చేశామన్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా కమలాపురంలో అభివృద్ధి జరిగిందన్నారు. దీనికి కారణం జగనన్నేనని స్పష్టం చేశారు. చంద్రబాబు వేల హామీలిచ్చి పాలన గాలికొదిలేశారన్నారు. జన్మభూమి కమిటీలు చెప్పిన వారికే అరకొర ప్రభుత్వ పథకాలు వచ్చేవన్నారు. ప్రస్తుతం జగనన్న పాలనలో అర్హత ఉంటే చాలని, వలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాలు నేరుగా ఇంటికి చేరుతాయన్నారు. అలాగే కోగటంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కరుణ్‌రెడ్డి సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏడీఏ నరసింహారెడ్డి, మున్సిపల్ కమిషనర్ నరసారెడ్డి, మండల కన్వీనర్ ఉత్తమారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ సుమిత్రా రాజశేఖర్ రెడ్డి, డీసీసీబీ వైస్ చైర్మన్ రాజుపాళెం సుబ్బారెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ సీఎస్ నారాయణరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ ఎస్‌సీ పుల్లారెడ్డి, జడ్పీటీసీ సుమిత్రారెడ్డి, గఫార్, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, ఖాజాహుసేన్, ఇర్ఫాన్, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : మండలంలోని కొమ్మద్ది సచివాలయంలో నిర్వహించిన ఆంధ్రకు జగన్ ఎందుకు కావాలి కార్యక్రమంలో ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. వలంటీర్లు, గృహ సారథులు, నాయకులు ప్రతి ఇంటికి వెళ్లి గతంలో తెలుగుదేశం పార్టీ ఇచ్చిన హామీలు, ప్రస్తుత ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలకు ఉన్న తేడాలను వివరించాలన్నారు. అనంతరం కొమ్మద్ది గ్రామంలో పార్టీ జెండాను ఎగురవేసి సంక్షేమ పథకాల సంబంధించిన బోర్డును ఆవిష్కరించారు. మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, పరిశీలకుడు రాజుపాలెం జగన్‌మోహన్‌రెడ్డి, మండల అభివృద్ధి అధికారి చంద్రశేఖర్‌రెడ్డి, స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వల్లూరులో..

వల్లూరు : మండలంలోని కొట్లూరు గ్రామ సచివాలయంలో నిర్వహించిన మా నమ్మకం నువ్వే జగనన్నా కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యుడు అబ్బిరెడ్డి వీరారెడ్డి పాల్గొని మాట్లాడారు. దిగువపల్లె గ్రామ సచివాలయ పరిధిలోని ప్రజలకు ఈ నాలుగేళ్లలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా 29 కోట్ల 96 లక్షల రూపాయలను అందచేశారన్నారు. అనంతరం సంక్షేమ పథకాల బోర్డులను ఆవిష్కరించి వైఎస్ఆర్‌సీపీ జండాను ఎగురవేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ వెంకటసుబ్బయ్య, సచివాలయ జేసీఎస్ కన్వీనర్ ఇందిరెడ్డి శంకర్‌రెడ్డి, శివకుమార్‌రెడ్డి, పార్టీ నేతలు నాగిరెడ్డి, వెంకట సుబ్బారెడ్డి, పుల్లయ్య, మస్తాన్, ఎంపీడీవో కేఈఆర్‌ఎం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పెండ్లిమర్రిలో..

పెండ్లిమర్రి : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు చేసిన మంచిని ప్రజలకు వివరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రారెడ్డిలు తెలిపారు. మొయిళ్లకాల్వ గ్రామ సచివాలయంలో గురువారం ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. అలాగే మా నమ్మకం నువ్వే జగనన్న జెండాను ఎగవేశారు. కార్యక్రమంలో సింగల్ విండో అధ్యక్షుడు నాగేంద్రారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ అమర్‌నాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు హుస్సేన్, కృష్ణారెడ్డి, ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

సీకేదిన్నెలో..

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొప్పర్తి సచివాలయంలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమంలో సీకేదిన్నె జెడ్పీటీసీ పి.నరేన్ రామాంజులరెడ్డి పాల్గొని మాట్లాడారు. ఏపీకి జగనే ఎందుకు కావాలంటే పుస్తకాలను ఆవిష్కరించి వైఎస్ఆర్‌సీపీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో ఏపీ మైనార్టీ బోర్డు మెంబర్ హిదాయతుల్లా, మండల కన్వీనర్ గూడా ప్రభాకర్‌రెడ్డి, మండల సమన్వయకర్త గుత్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పులివెందులలో..

పులివెందుల టౌన్ : స్థానిక పెద్దరంగాపురం సచివాలయం, పెద్ద కొండప్ప కాలనీలోని సచివాలయాల పరిధిలో నిర్వహించిన 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. పెద్దరంగాపురం సచివాలయానికి రూ.28 కోట్లు, పెద్దకొండప్ప కాలనీ సచివాలయానికి రూ.48 కోట్లకు పైగా నిధులు విడుదల చేసి వారి ఖాతాలలో జమచేశారన్నారు. ప్రజల సంక్షేమం కోసం పాటుపడిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని ప్రజలు రుకుంటున్నారన్నారు. అనంతరం సంక్షేమ పథకాల హోర్డింగ్‌ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమాలలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హాఫీజ్, మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జిలు పార్నపల్లె కిశోర్, చంద్రమౌళి, అంకాలమ్మ ఆలయ చైర్మన్ బ్యాటరీ ప్రసాద్, కోఆప్షన్ మెంబర్ చంద్రమౌళి, కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వేములలో..

వేముల : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలతో పొందిన లబ్ధిని ప్రజలలోకి తీసుకెళ్లాలని వైఎస్సార్‌సీపీ మండల పరిశీలకుడు లింగాల రామలింగారెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ లింగాల ఉషారాణిలు తెలిపారు. గురువారం స్థానిక వేల్పుల సచివాలయంలో వై ఏపీ నీడ్ జగన్ అనే కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో కుటుంబాల వారీగా వారి ఇళ్లకు వెళ్లి ప్రభుత్వం ద్వారా ఏ మేరకు లబ్ధి పొందారో వారికి వివరించాలని వలంటీర్లకు సూచించారు. వలంటీర్లకు లబ్ధిదారుల వివరాలతో ఉన్న కిట్లను పంపిణీ పార్టీ జెండాను ఆవిష్కరించారు. సర్పంచ్ నిర్మల, ఎంపీటీసీ బాబ్‌జాన్, మాజీ సర్పంచ్ లింగాల పార్వతమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : మండలంలోని సుంకేసుల గ్రామంలో గురువారం నిర్వహించిన ఏపీకి జగనన్న ఎందుకు కావాలి అనే కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొని మాట్లాడారు. సచివాలయ పరిధిలో ప్రజలకు అందిన సంక్షేమ పథకాల నిధుల పట్టిక బోర్డును ఆవిష్కరించి గ్రామంలో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నారాయణరెడ్డి, మహేశ్వరరెడ్డి, జగదీశ్వరరెడ్డి, శివారెడ్డి, ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తొండూరులో..

తొండూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ రాష్ట్రానికి సీఎం కావడం ఎంతో అవసరమని శాప్ రాష్ట్ర డైరెక్టర్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రవీంద్రారెడ్డి తెలిపారు. గోటూరు సచివాలయ పరిధిలోని ఏపీకి వైఎస్ జగన్ ఎందుకు కావాలనే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, సర్పంచ్ శ్రీనివాసులరెడ్డి, డైరెక్టర్లు సురేష్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, గృహసారథుల కన్వీనర్ రజినికాంత్‌రెడ్డి, తాలుకా కార్యదర్శి దశరథరామిరెడ్డి, గంగిరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె : మండలంలోని తాళ్లపల్లె గ్రామ సచివాలయంలో నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రఓబుళరెడ్డి, ఎంపీపీ లక్ష్మీగాయత్రిలు పాల్గొని మాట్లాడారు. సచివాలయ ఉద్యోగులు, లబ్ధిదారులు, ప్రజాప్రతినిధులతో కలిసి సచివాలయ పరిధిలో ఆయా పథకాలతో లబ్ధి పొందిన వివరాలు, సంక్షేమాభివృద్ధికి సంబంధించిన బోర్డును ఆవిష్కరించారు. అనంతరం ప్రతి ఇంటికి వెళ్లి నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలన, మ్యానిఫెస్టో అమలు, వివిధ సంక్షేమ, అభివృద్ధి గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శ్రీనివాసులు, సర్పంచ్ విజయకుమారి, సచివాలయ కన్వీనర్ రామశేఖరరెడ్డి, గృహసారథులు, సచివాలయ సిబ్బంది, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

లింగాలలో..

లింగాల : మండలంలోని పార్నపల్లె సచివాలయంలో నిర్వహించిన ఏపీకి వైఎస్ జగన్ ఎందుకు కావాలి అనే కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పి.వి.సుబ్బారెడ్డి పాల్గొని మాట్లాడారు. గత టీడీపీ హయాంలో అప్పటి ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఏ మేరకు అమలయ్యాయి.. ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చిన తీరును ప్రజలలోకి తీసుకెళ్లాలని గృహసారథులు, వలంటీర్లకు వివరించారు. కార్యక్రమంలో కడప పార్లమెంటరీ కన్వీనర్ సారెడ్డి చంద్రశేఖరరెడ్డి, సర్పంచ్ సుబ్బయ్య, ఉప సర్పంచ్ నాయుడు, ఎంపీటీసీ నాగలక్ష్మి, గ్రామ నాయకులు పుల్లా నాయుడు, రాఘవయ్య, తిమ్మానాయుడు, జేసీఎస్ మండల కన్వీనర్ నాగేంద్రనాథరెడ్డి, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ కర్ణా రమేష్‌రెడ్డి, కడప పార్లమెంటరీ కన్వీనర్లు జగన్‌మోహన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఎంపీడీఓ సురేంద్రనాథ్, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : స్థానిక 8వ సచివాలయ పరిధిలోని 17వ వార్డులో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలి కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. గత ఎన్నికల్లో చంద్రబాబు హామీలిచ్చి మోసం చేసిన తీరు, ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీలు నెరవేరుస్తూ ఎలా పాలిస్తున్నారో వివరించారు. నాలుగున్నరేళ్లలో సీఎం జగనన్న ప్రతి ఇంటికి రూ.లక్షల్లో లబ్ధి చేకూర్చారన్నారు. చంద్రబాబు లాంటి నయవంచకుడు, మోసగాడి మాటలను నమ్మి ప్రజలు మోసపోవద్దు అన్నారు. అనంతరం ఆయన వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి, వైస్ చైర్మన్ చంద్రకళ, కౌన్సిలర్ ఎరికలరెడ్డి, కో ఆప్షన్ సభ్యులు డి.సూర్యానారయణరెడ్డి, మహమ్మద్‌రఫీ, కమిషనర్ పి.జగన్నాథ్, వ్యవసాయ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ హరిప్రసాద్‌రెడ్డి, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సుబాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు. అలాగే ఇల్లూరు గ్రామంలో కూడా ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ ఎం.వెంకటకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.

సొసైటీలను బ్యాంక్‌లుగా తీర్చిదిద్దడమే లక్ష్యం



సహకార కేంద్ర పథకాల పోస్టర్లను విడుదల చేస్తున్న ఓఎస్డీ, తదితరులు

పులివెందుల రూరల్ : సొసైటీలను బ్యాంక్‌లుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా సహకార సమాఖ్యల అభివృద్ధికి కృషి చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, డీసీసీ బ్యాంక్ చైర్మన్ మల్లేల ఝాన్సీరాణిలు తెలిపారు. గురువారం నల్లపురెడ్డిపల్లెలో ఎర్రబల్లె ప్రాథమిక వ్యవసాయ సహకార కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన గోల్డ్ లోన్‌కు సంబంధించి స్ట్రాంగ్ రూంను వారు ప్రారంభించారు.

అనంతరం సొసైటీ ఖాతా దారులు, రైతులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాయలసీమ పరిధిలో ఉన్న డీసీసీ బ్యాంక్ లను లాభాల బాటలో నడిపించారని చైర్మన్లను అ భినందించారు. సొసైటీలో కూడా బంగారు రుణాలపై విరివిగా రుణాలు ఇవ్వడం జరుగుతుందన్నా రు. సొసైటీలో ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని కూడా ఏర్పా టు చేశారన్నారు. సొసైటీ సహకార బ్యాంక్‌లలో అకౌంట్లు, డిపాజిట్లు చేసేవారికి విరివిగా రుణాలు ఇవ్వాలన్నారు. సహకార సొసైటీలను బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. రైతుల పిల్లలు విదేశాలలో చదివేందుకు ఎడ్యుకేషన్, హౌసింగ్ రుణాలు ఇచ్చేందుకు సొసైటీలు సిద్ధంగా ఉన్నాయన్నారు. చిన్నపిల్లలు రుణాలను పొదుపు చేసే విధంగా తల్లి, పిల్లల మీద అకౌంట్లు ఓపెన్ చేసుకోవచ్చునన్నారు. అలాగే సహకార కేంద్ర పథకాలతో ఏర్పాటు చేసిన పోస్టర్లను వారు విడుదల చేశారు. డ్వాక్రా సంఘాలకు మంజూరైన చెక్కులను వారు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా సహకార కేంద్ర సీఈఓలు రాజేంద్రకుమార్, సుభాషిణి, కో ఆపరేటివ్ ఆఫీసర్ సురేష్‌కుమార్, ఎర్రబల్లె సొసైటీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గంగరాజు, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు బాలగంగిరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, నీలకంఠారెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, గంగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బలరామిరెడ్డి, రామమల్లేశ్వరరెడ్డి, ఉమామహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త రామ్మూర్తి

పంట మార్పిడిపై అవగాహన

చెన్నూరు : మండలంలోని ఓబులంపల్లెలో రైతులకు వరిలో పంట మార్పిడిపై దృష్టి సారించే విధంగా కేవీకే ప్రధాన శాస్త్రవేత్త రామ్మూర్తి గురువారం అవగాహన కల్పించారు. రైతులు వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలపై దష్టి సారించాలన్నారు. దీనికి సంబంధించి ఉపకరణాల పంపిణీ చేస్తామన్నారు. నీటి కొరత వలన రైతులు ఇతర ప్రత్యామ్నాయ పంటలు పప్పు ధాన్యాలు, నూనె పంటలు సాగుచేయడం వలన అధిక దిగుబడిని సాధించవచ్చునన్నారు. కేవీకేల ద్వారా రైతులకు అందుబాటులో ఉంటామన్నారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ కె.సాయిమహేశ్వరి, మండల వ్యవసాయ అధికారి శ్రీదేవి, ఇందిర విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్, రైతులు పాల్గొన్నారు.

కష్టపడేవారిని గుర్తించండి

– జనసేన పార్టీ నాయకులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జనసేన పార్టీ నాయకులు తుపాకుల చంద్రశేఖర్

పులివెందుల టౌన్ : జనసేన పార్టీ పెట్టినప్పటినుంచి పులివెందుల నియోజకవర్గంలో పార్టీ తరఫున ఎంతోమంది కష్టపడి పనిచేస్తున్నారని.. వారిని గుర్తించకుండా ప్రజలలో కనిపించని హరీష్ అనే వ్యక్తికి పులివెందుల నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జిగా ఏ విధంగా నియమిస్తారని పులివెందుల జనసేన పార్టీ నాయకులు తుపాకుల చంద్రశేఖర్, యువరాజు, సాయికుమార్‌లు ప్రశ్నించారు. గురువారం స్థానిక వైఎస్సార్ ప్రెస్‌క్లబ్‌లో వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెగా ఫ్యామిలీకి సంబంధించి వారు ఏ పార్టీకి మద్దతు ఇస్తారో ఆ పార్టీతో మేము పనిచేస్తూ పోతున్నామని.. ప్రజారాజ్యం పార్టీ ఏర్పాటు చేసినప్పుడు కూడా ఆ పార్టీ అధినేత చిరంజీవితోపాటే మేము కూడా ఇక్కడ పులివెందుల నియోజకవర్గంలో పనిచేశామన్నారు. అంతేకాక జనసేన పార్టీ ఏర్పాటు అయినప్పటి నుంచి కష్టపడి ఆ పార్టీ కోసం పనిచేస్తున్నామని జిల్లా కన్వీనర్ సుంకర శ్రీనివాసులు మమ్ములను పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. ఇటీవల పార్టీ నియోజకవర్గాల సంబంధించి ఇన్‌చార్జిలను నియమిస్తున్నారని మాకు తెలిసిందన్నారు. పులివెందుల నియోజకవర్గానికి సంబంధించిన వ్యక్తి కాకుండా ఎక్కడో తిరుపతిలో ఉండే హరీష్‌కు పదవి ఇవ్వడం సబబు కాదన్నారు.

సీనియర్ ఫొటోగ్రాఫర్ మృతి

కడప కల్చరల్ : కడప నగరానికి చెందిన సీనియర్ ఫొటోగ్రాఫర్ వి.ప్రభాకర్‌రావు గురువారం తన స్వగృహంలో కన్నుమూశారు. రాజా కలర్ ల్యాబ్ అధినేతగా జిల్లా ఫొటో అండ్ వీడియో గ్రాఫర్ల సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షులుగా ఆయన జిల్లా ఫొటోగ్రాఫర్లు, ఆ రంగ ప్రముఖులకు సుపరిచితులు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఫొటో వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ తమ సంతాపాన్ని వ్యక్తం చేశారు. సినీ నిర్మాతగా.. తల్లిదండ్రులు జాగ్రత్త, భావిపౌరులు తదితర సినిమాలను నిర్మించి నటించారని గుర్తు చేశారు.

కష్టపడి చదివితే లక్ష్యాన్ని చేరుకోవచ్చు



వేములలో మాట్లాడుతున్న గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ ఉషారాణి



సింహాద్రిపురంలో పరుగు పందెం పోటీలో విద్యార్థులు



పులివెందులలో విద్యార్థులకు స్వచ్ఛ భారత్‌పై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు



జమ్మలమడుగులో గ్రంథాలయ ఉద్యమకారులకు నివాళులు అర్పిస్తున్న ఏజీ

వేముల : ప్రతి విద్యార్థి కష్టపడి చదివితే నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చునని గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ లింగాల ఉషారాణి తెలిపారు. గురువారం స్థానిక కస్తూర్బా గాంధీ విద్యాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరు చదువుకోవాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను విద్యార్థుల కోసం ప్రవేశపెట్టిందన్నారు. గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలను చదివి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. పుస్తకాలను చదవడంవల్ల క్రమశిక్షణ, మంచి అలవాట్లు, మంచి నడవడికలు నేర్చుకోవచ్చునన్నారు. గ్రంథాలయాలలో అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఆమెను పాఠశాల సిబ్బంది ఘనంగా సత్కరించారు. పాఠశాలలో విద్యార్థినులు వేసిన ముగ్గులను తిలకించి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలకు విద్యార్థినులను ఎంపిక చేశారు. వీరికి 20వ తేదీన బహుమతుల ప్రదానం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయరాఘవరెడ్డి, తహసీల్దార్ వెంకటసుబ్బయ్య, ఎంఈఓ చంద్రశేఖర్, గ్రంథాలయ అధికారి గంగాధర, పాఠశాల ఎస్‌ఓ శారదమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

లింగాలలో..

లింగాల : 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా గురువారం లింగాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గ్రంథాలయ అధికారిణి జయమ్మ వ్యాసరచన, ఉపన్యాస, చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. దీనికి ఇన్విజిలేటర్‌గా హెచ్‌ఎం ప్రసాద్ వ్యవహరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం లక్ష్మి, ఉపాధ్యాయులు రఘునాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పులివెందులలో..

పులివెందుల టౌన్ : పట్టణంలోని శాఖ గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా గ్రంథాలయ అధికారి కిరణ్ ఆధ్వర్యంలో అహోబిలాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుభ్రత, పరిశుభ్రత, స్వచ్ఛ భారత్‌పై అవగాహన కల్పిస్తూ వాటిపై పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ భాస్కర్, ఉపాధ్యాయులు, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేంపల్లెలో...



వేంపల్లెలో పుస్తక ప్రదర్శనలో విద్యార్థులు



లింగాలలో వ్యాసరచన పోటీలలో విద్యార్థులు

వేంపల్లె : స్థానిక శాఖ గ్రంథాలయంలో గురువారం విద్యార్థులకు పుస్తక ప్రదర్శనను నిర్వహించినట్లు గ్రంథాలయ అధికారిణి వనజకుమారి తెలిపారు. ఈ సందర్భంగా గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖులు డాక్టర్ రంగనాథన్, నాగభూషణం, వెంకటరమణయ్య తదితర వారిని స్మరించుకున్నారు. అలాగే వ్యాసరచన, చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కమలాపురంలో..

కమలాపురం : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని స్వామి వివేకానంద హైస్కూల్ కరస్పాండెంట్ రామసుబ్బారెడ్డి, గురుకుల పాఠశాల లెక్చరర్ శేషశయన తెలిపారు. ఈనెల 14వ తేదీ నుంచి జరుగుతున్న గ్రంథాలయ వారోత్సవాలలో గ్రంథాలయ ఉద్యమకారులైన అయ్యంకి వెంకట రమణయ్య, పాతూరి నాగభూషణం, ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటాలకు వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు వివిధ అంశాలలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారిణి నాగాంజలి, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : సింహాద్రిపురం, కోవరంగుంటపల్లె గ్రంథాలయాలలో గురువారం గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా విద్యార్థులకు గ్రంథాలయ అధికారులు శేఖర్, గంగాదేవిలు వ్యాసరచన పోటీలు, పరుగు పందెం, ఫ్రాగ్ గేమ్ పోటీలు, జాతీయ నాయకుల చిత్ర పటాన్ని డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : ప్రభుత్వ గ్రంథాలయాలను నిరుద్యోగులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. గురువారం గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా గ్రంథాలయ ఉద్యమ కారులైన అయ్యంకి వెంకటరమణయ్య, గాడి చర్ల సర్వోత్తమరావు, ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ప్రస్తుతం పాఠకులందరూ ఈ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకునేవిధంగా ప్రభుత్వాలు ఏర్పాటు చేశాయన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ లైబ్రేరియన్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

హాకీ చాంపియన్‌షిప్‌కు యాసిన్



కడప స్పోర్ట్స్ : చెన్నై నగరంలో ఈనెల 17 నుంచి నిర్వహిస్తున్న 13వ హాకీ ఇండియా సీనియర్ మెన్ నేషనల్ హాకీ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే ఏపీ జట్టుకు కడప నగరానికి చెందిన ఎస్. మహమ్మద్ యాసీన్ ఎంపికయ్యాడు. ఇటీవల కాకినాడలో నిర్వహించిన ఏపీ సీనియర్ మెన్ హాకీ క్యాంపులో చక్కటి ప్రతిభ కనబరచడంతో సీనియర్ నేషనల్ హాకీ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే ఏపీ జట్టుకు గోల్‌కీపర్‌గా ఎంపికయ్యాడు. కడప నగరంలోని వైఎస్ఆర్ క్రీడాపాఠశాలలో 4 నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యనభ్యసించడంతో పాటు హాకీలో పలు రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని సత్తాచాటాడు. ప్రస్తుతం కడప నగరంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఎంబీఏ చదువుతూ హాకీలో రాణిస్తున్నాడు.

బాల్య వివాహాలు చట్టరీత్యానేరం

కడప కోటిరెడ్డిసర్కిల్ : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని జిల్లా ప్రొటెక్షన్ ఆఫీసర్ జి.సునీత తెలిపారు. గురువారం నగరంలోని అంగడివీధి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలల హక్కుల వారోత్సవాల సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాలలకు రక్షణ కల్పించడంలో బాలల హక్కులు కీలకపాత్ర పోషించడం జరుగుతోందన్నారు. పిల్లలకు సంబంధించి సమస్యలు వచ్చినపుడు వాటిని ఎలా ఎదుర్కోవాలో, వివిధ చట్టాలు, వ్యవస్థల గురించి అవగాహన కల్పించేందుకు నిర్వహిస్తున్నామన్నారు. బాల్య వివాహాలు నిరోధించడంలో ప్రతి విద్యార్థి చేయిచేయి కలపాలని సూచించారు. ప్రస్తుతం టెక్నాలజీ, సోషల్ మీడియా వంటి ప్రభావాలు పిల్లలపై ఎక్కువగా చూపుతున్నాయని, పిల్లలు జాగ్రత్త వహించాలని సూచించారు.